"నే నెరిగిన శివరావుగారు"

శ్రీ దిగవల్లి శివరావుగారు ఆంధ్రదేశంలోని మేధావులలో పేరెన్నిక గన్నవారు. సర్వతో ముఖ ప్రజ్ఞాధురీణులు. శ్రీ ప్రకాశం పంతులుగారి కోవలోనివారు. శ్రీ శివరావు గారిని గురించి ఈనాటియువకులకు తెలియక పోవచ్చుగాని, ఆ రోజులలో అంటే 1930, 1932, 1942 సంవత్సరాలలో కాంగ్రెసు రణరంగంలోవారు ధరించిన పాత్ర తలచుకుంటే వళ్ళు జలదరిస్తుంది. శివరావుగారు, ఘంటసాల సీతారామశర్మగార్ల పాత్ర తలచుకొన్నప్పుడు వళ్ళు పులకరిస్తుంది.

ఈ రోజులలో వేదికపై కెక్కి ఉపన్యాసాలు ఇచ్చి, ప్రభుత్వం ఇలా చేస్తున్నదని.

— శ్రీ —

కాకాని వెంకటరత్నం

అలా చేస్తున్నదని విమర్శించడం ఏమాత్రం కష్టంకాదు. కాని, ఆ రోజులలో శివరావుగారు విమర్శలు చేశారన్నా, పుస్తకాలు వ్రాశారన్నా చాలా గొప్ప విషయం. వారి ధైర్యం అమితం, ఆ రోజులలో వారు మా అందరికి ధైర్యం కలుగచేసి, వలంటీరులను ఉత్సాహ పరచి రంగంలోకి పంపించేవారు. నిజము యిది. అందరికి ఆదర్శమైన నాయకులు ఆ రోజులలో ఎవరైనా వున్నారా అని అంటే ఒక్క శివరావుగారని మాత్రం చెప్పాలి. శివరావుగారి రచనలే ఆ రోజులలో మాకు ఆధారం. అవి మమ్మల్ని ఉత్తేజపరచి, మాలో జాతీయ చైతన్యం కలుగచేసి దేశభక్తులుగను, త్యాగధనులుగను తయారుచేసినవని చెప్పాలి.

వారు వేదికలు ఎక్కి ఉపన్యాసాలు యివ్వనక్కరలేదు. ఇవ్వనూలేదు. వారు నోటితో ఒక్క మాట పలుకనక్కరలేదు. అవి అంటే చాలు, మేము అందరమూ ముందుకు దూకే వాళ్ళం.

మూర్తిత్రయం

వారి అనుచరులు, వారు కలసి ఒక మండలి. శివరావుగారు, శ్రీ చెరుకువల్లి వేంకటప్పయ్యగారు, డాక్టర్ ఘంటసాల సీతారామశర్మగారు - ఈ ముగ్గురూ కలసి తిరిగేవారు, డాక్టర్ వెలిదండ్ల హనుమంతరావుగారు కూడా వుండేవారు. వారు పరమపదించారు. ఈ పైముగ్గురు వ్యక్తులు ఒక మండలి. వారిపేరు చెపితే చాలామందికి హడలు. ఎక్కడో, ఏరోడ్డుమీదో, ఆంధ్ర రత్న భవనంలోనో కలిసేవారు. ఇంక చర్చే వారు. విమర్శించేవారు. వారిచుట్టూ అనేక మంది కూడేవారు, పెద్ద పెద్ద వాళ్ళే వాళ్ళ పేరు చెబితే చాలా భయపడి పోయేవాళ్లు.

ఆరోజులలో హెక్మాడీ అనే జాయింటుమేజిస్ట్రేటువుండేవాడు, బహుకోపిష్టుడు. ప్రతివారికి సంవత్సరాల కొద్ది శిక్షలు వేసేవాడు. అందరు భయపడి వెనుకంజ వేసేవారు. మహానాయకు లెవ్వరూ లేరు, ఎవరికి వారు వెళ్ళి జైళ్ళలో కూర్చున్నారు. అలాంటి సమయంలో ఇక్కడ మాకు ఒక్క శివరావుగారు మాత్రం సలహాలుగాని, ధైర్యాలుగాని వున్నారు.



శ్రీ బసవరాజు అప్పారావు మొదలైన అనేక కవులచేత ఉద్రేకపూరితమైన పద్యాలు పాటలు వ్రాయించి తెచ్చి పాడించేవారు. ఉదాహరణకు, తల్లులనువిడిచి పిల్లలు రండోయి, పిల్లలను విడిచి తల్లులు రండోయి, భార్యలను విడిచి భర్తలు-భర్తలను విడిచి భార్యలు రండోయి అని మేమందరము పాడుతూ వెళుతుంటే, మాలో తెలియని ఆవేశంకలిగేది, ప్రాణభీతి కూడా వుండేదికాదు. నిజంగా తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆ రోజులలో నిజంగా నే తల్లులను విడిచి పిల్లలు, పిల్లలను విడిచి తల్లులు, భార్యలను విడిచి భర్తలు, భర్తలను విడిచిభార్యలు వచ్చి ఉద్యమంలో చేరేవారు. ఆకస్మికంగా చేరినవారిలో డాక్టర్ రాయప్రోలు సీతారామ శాస్త్రిగారు జైలులో దెబ్బలుతిని పరమపదించారు. శ్రీ శివరావు జైలుకు వెళ్ళకపోవచ్చు! దెబ్బలు తినకపోవచ్చు; కాని ఆయన వెనక నిలబడి మమ్ములను తయారుచేశారు. అందరు జైలుకు వెళ్ళనక్కరలేదు. వెళ్ళినవారే దేశభక్తులుకారు. వెళ్ళకుండా సేవచేసినవారు అనేకమంది డాక్టర్లు, లాయర్లు వున్నారు. దిక్కు మొక్కులేని వలంటీర్లకు సేవచేసిన అలాంటి వారు మహానుభావులు అనేకమంది అజ్ఞాతంగా ఉండి ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా అమితమైన సేవచేశారు. ముఖ్యంగా శ్రీ శివరావుగారు మాకు నాయకులు. వారుచేసిన సేవ అపారం.

సమాచార సర్వస్వం

వారిదగ్గర ఎలాంటి సమాచారం కావలసినా దొరికేది. అది ఒక గని, చెప్పడానికి వీలు పడదు. ఆయన మాకు గురువు, మార్గదర్శి పగటిపూట వారియింటికి వెళ్ళడానికి భయపడే వాళ్ళం. ఏమో ఎప్పుడొచ్చి పట్టుకుంటారో అని. ఎప్పుడూ యింటి దగ్గర సందులో పోలీసు వారు తిరిగేవారు. పట్టుకుంటే వారి వృత్తికి కూడా ముప్పు, అందుకని అందరు కలిసి రాత్రివేళ రహస్యంగా వెళ్ళేవాళ్ళం. ఇంట్లో పెద్ద పెద్ద సమావేశాలు అవుతూ వుండేవి; చర్చలు జరుగుతూ ఉండేవి. అనేకమైన విషయాలు తెలుసుకుంటూ వుండే వాళ్ళం. ఇంట్లో సైక్లోస్టయిలు కాపీలు ఇవ్వబడుతూ వుండేవి. రహస్యంగా గోడ దాటించబడుతూ వుండేవి. అది అంతా తలచుకుంటే చాల విచిత్రంగానే వుంటుంది.

శివరావుగారు సత్యం కోసం పాటుపడ్డారు. తనకు తోచింది ధైర్యంగా, వెనకడుగు వెయ్యకుండా చెప్పగలవారు శివరావుగారు ఒక్కరే. దెబ్బలాటలు కొట్టుకోవటం జరిగితే శివరావుగారికి చెరుకువల్లి వెంకటప్పయ్యగారికి కలెక్టరు కబురుచేసి నిజం చెప్పమని అడిగేవారు. ఇలాంటి సందర్భాలు ఇంకా ఎన్నో వున్నాయి.

శివరావుగారు మా అందరికీ పూజ్యులు, మా అందరికోరకు పాటుబడ్డారు; వారిని ప్రభుత్వం- అంటే ఆనాటి పెద్దలు కొందరు ఈనాడు మరచిపోయారే, వారికి జ్ఞాపకం చేసి శివరావును ఎలా తగు విధంగా సత్కరించాలా అని అనేకసార్లు తాపత్రయపడ్డాను.

వారి పుస్తకాలు అచ్చువేయవలసినవి, వేసినవి, అనేకం ఉన్నాయి. వారి పుస్తకాలను పాఠ్యగ్రంథాలుగా పెట్టి, అచ్చువేసి వారిని సన్మానించవలసిన బాధ్యత ప్రభుత్వంమీద ఉన్నది.

వారికి రచయితగా ఎంత పేరున్నదో న్యాయవాదిగా అంత పేరున్నది. గౌరవం వున్నది. అలాంటి వారు శివరావుగారు ఒక్కరే అని నిస్సంశయంగా చెప్పగలను.

(విజయవాడలో జరిగిన శ్రీ దిగవల్లి శివరావు సన్మానసభలో శ్రీ కాకాని వెంకటరత్నం ప్రసంగంలోని ముఖ్య భాగాలను పైన వ్యాసరూపంలో ప్రచురించాము.)

ఆంధ్రజ్యోతి 9/10/1966